సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం । 3 । మార్చి । 2024

సమన్వయ లోపం.. అభ్యర్థులకు శాపం

వారంతా ఇంటర్ ఒకేషనల్ కోర్సు క్రాప్ ప్రొడక్షన్ మేనే జ్‌మెంట్ చదివిన అభ్యర్థులు. ఏఈవో ఉద్యోగాలు వస్తాయని వ్యయప్రయాసల కోర్చి కోర్సు పూర్తి చేశారు. ఇప్పుడు అర్హులు కాదంటున్నారు.

8లో▸

పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 4న ప్రధాని పర్యటన సందర్భంగా విద్యార్థులు నిర్దేశిత సమయాని కంటే ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని డీఐఈవో రవీందర్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున విద్యార్థులు, తల్లిదండ్రులు విషయాన్ని గమనించాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0/22.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. కొంతమేర మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న రిమ్స్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆదిలాబాద్‌టౌన్: జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిమ్స్ కార్మికులు చేపడుతున్న నిరసన కొనసాగుతోంది. పదో రోజు శనివారం కూడా ఆందోళన చేపట్టారు. కాంట్రాక్టర్‌ను తొలగించాలని, జీవో 60 ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈనెల 7 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సిర్ర దేవేందర్, సంఘ బాధ్యులు చందు, సంగీత, సునిత, రాజేందర్ సింగ్, కమలమ్మ, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 486 మంది గైర్హాజరు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 9,635 మందికి గాను 486 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రవీందర్‌కుమార్ తెలిపారు. కాగా జనరల్ కోర్సులో 8,628 మందికి గాను 8,228 మంది హాజరయ్యారు. 400 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులో 1007 మందికి గాను 921 మంది హాజరయ్యా రు. 86 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో వివరించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా సంక్షేమ అధికారి సబితా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా, స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వారం పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో లింగ సమానత్వం, మహిళల హక్కులపై పట్టణంలోని బడాతలాబ్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కేంద్రం సిబ్బంది కృష్ణవేణి, రాధ, కోటేశ్వర్, నిఖిలేష్, అంగన్‌వాడీ టీచర్ శ్రీలత పాల్గొన్నారు.

4న నల్లజెండాలు ప్రదర్శించాలి



శిబిరంలో కూర్చున్న కమిటీ సభ్యులు

కైలాస్‌నగర్: ప్రధాని మోదీ జిల్లా పర్యటన నేపథ్యంలో ప్రజలు ఈ నెల 4న నల్ల బ్యాడ్జీలు ధరించడంతో పాటు నల్ల జెండాలు ప్రదర్శించాలని రైల్వేలైన్ సాధన కమిటీ చైర్మన్ దేవేందర్, ప్రధాన కార్యదర్శి నరేందర్ కోరారు. ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్‌కు నిధులు మంజూరు చేయాలనే డిమాండ్‌తో కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారంతో 47వ రోజుకు చేరాయి. దీక్షలో కమిటీ సభ్యులు కేశవ్, భాస్కర్, వరుణ్, రాములు, నిఖిల్, దేవిదాస్ చారి, ఆంజనేయులు, మహేందర్ తదితరులు కూర్చున్నారు.

శ్రీపాదరావుకు ఘన నివాళి



శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 87వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీపాదరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ, యువజన సంక్షేమాధికారులు రాథోడ్ రమేశ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సిట్టింగ్.. పెండింగ్!

- బీజేపీ తొలి జాబితాలో 'సోయం'కు నో ఛాన్స్
- ఆదిలాబాద్ ఎంపీ సీటుపై ఉత్కంఠ
- రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ

కైలాస్‌నగర్: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ అధిష్టానం తొలివిడత జాబితాను శనివారం ప్రకటించింది. ఇందులో తెలంగాణ నుంచి తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ముగ్గురు సిట్టింగ్ ఎంపీలకు మళ్లీ పోటీ చేసేందుకు అవకాశం కల్పించింది. ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గమైన ఆదిలాబాద్ స్థానాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టడం గమనార్హం. సిట్టింగ్ ఎంపీగా ఉన్న సోయం బాపూరావు పేరును ప్రకటించకపోవడంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. సోయం పేరును ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టడం వెనుక అంతర్యమేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక్కడి నుంచి బరిలో నిలిచేందుకు పలువురు అభ్యర్థులు పోటీ పడుతుండగా బాపూరావు మాత్రం ఇంకా తనకే టికెట్ వస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ వెనుక మతలబేంటో..

ప్రధానమంత్రి మోదీ ఆదిలాబాద్ పర్యటన సోమవారం ఖరారైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లాతో పాటు ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రజలందరి దృష్టి పీఎం సభపైనే కేంద్రీకృతమై ఉంది. పార్టీ అభ్యర్థుల తొలి జాబితాలో భాగంగా ఆదిలాబాద్ అభ్యర్థిని కూడాప్రకటించి మోదీ ఎన్నికల ప్రచారానికి ఇక్కడి నుంచే శ్రీకారం చూడుతారనే ప్రచారం సాగింది. అయితే అధిష్టానం మాత్రం ఈ టికెట్ విషయంలో ఆచీతూచి వ్యవహరిస్తున్నట్లుగా తెలుస్తోంది. రాష్ట్రంలో సిట్టింగ్ ఎంపీలుగా ఉన్న కిషన్‌రెడ్డి, సంజయ్,అరవింద్‌కు మరోసారి అవకాశం కల్పించగా ఆదిలాబాద్ ఎంపీ సోయం పేరును మాత్రం పెండింగ్‌లో పెట్టడం ఆసక్తి కలిగిస్తోంది. ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గమైనప్పటికీ దేశంలో నడుస్తున్న మోదీ మేనియాతో ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. తమకు అవకాశం కల్పించాలని రాష్ట్ర నాయకత్వానికి ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. కొంతమందైతే తమకే టికెట్ వస్తుందనే నమ్మకంతో ప్రచారానికి ప్రత్యేక వాహనాలను సైతం సిద్ధం చేసుకున్నారు. ఈక్రమంలో సోయం పేరు పెండింగ్‌లో పెట్టడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రాజకీయ వర్గాల్లో చర్చ

కమలం పార్టీ ప్రకటించిన తొలి విడత జాబితాలో సోయంకు చోటు దక్కకపోవడంపై పార్టీ శ్రేణులతో పాటు రాజకీయవర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. పార్టీ అధిష్టానం మదిలో ఏముందోననే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఆదిలాబాద్ టికెట్‌కు తీవ్ర పోటీ ఉండటంతోనే ఆయన పేరును ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టారనే టాక్ నడుస్తోంది. ఆయన స్థానంలో కొత్త అభ్యర్థినెవరినైనా బరిలోకి దింపుతారా అనే అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేస్తున్నారు. మోదీ రాక నేపథ్యంలో ఇది వరకు ఎంపీగా పనిచేసిన ఓ నాయకుడు బీజేపీలో చేరుతారనే ప్రచారం కూడా సాగుతోంది. అలాగే మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ సైతం తనదైన శైలిలో టికెట్ కోసం తీవ్రంగా యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో ఎవరికైనా ఒకరికి టికెట్ కేటాయిస్తారా లేక ఈ దఫా కొత్త వారిని తెరపైకి తెస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు మలి విడతలో తన పేరు తప్పకుండా ఉంటుందని సోయం బాపూరావు అధిష్టానంపై నమ్మకంతో ఉన్నారు. ఏం జరుగుతుందనేది మోదీ సభ అనంతరం తెలిసే అవకాశముంది.

బల్దియా బడ్జెట్ | రూ.96.31 కోట్లు



కమిషనర్ ఖమర్ అహ్మద్, వైస్‌చైర్మన్ జహీర్ రంజానీ వాగ్వాదం ఇలా..

- జనరల్ ఫండ్ అంచనా ఆదాయం రూ.29.61 కోట్లు
- ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాలిటీకి సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను రూ.96.31కోట్లుగా కౌన్సిల్ ఆమోదించింది. కార్యాలయ సమావేశ మందిరంలో చైర్మన్ ప్రేమేందర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో బడ్జెట్ ప్రవేశపెట్టి ఆమోదం తెలిపారు. సాధారణ నిధులు(జనరల్ ఫండ్)అంచనా ఆదాయం 29.61కోట్లుగా నిర్ణయించగా, ప్లాన్,నాన్‌ప్లాన్ గ్రాంట్‌ద్వారా రూ.66.32 కోట్ల ఆదాయం సమకూరనున్నట్లుగా అంచనా వేశారు. ఐదు శాతం నిధులను పొదుపు చేయడం ద్వారా రూ.1.86లక్షలు, అలాగే వ్యయంపై మిగులు నిధులఅంచనా రూ.35.51 కలిపి వచ్చే ఏడాది మార్చి 31 నాటికి రూ.37.37లక్షలు మిగలనున్నట్లుగా బడ్జెట్ రూపొందించారు.

కేటాయింపులు ఇలా...

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలకు రూ. 12.70 కోట్లు, పారిశుధ్య, నీటి సరఫరా నిర్వహణకు రూ.2.71కోట్లు, విద్యుత్‌చార్జీలకు రూ. 1.16కోట్లు కేటాయించగా పదిశాతం గ్రీన్ బడ్జెట్‌కు రూ. 3.73కోట్లు, ఇతరనిర్వహణ వ్యయం రూ. 5.53కోట్లు,1/3మిగులుబడ్జెట్ రూ.1.25కోట్లు, ప్రజల సౌకర్యాల కల్పన, వార్డుల్లో అభివృద్ధి పనులకోసం రూ.2.51కోట్ల చొప్పున రూ.29.61 కోట్లు కేటాయించారు. పన్నులద్వారా రూ. 13.16కోట్లు,అసైన్డ్‌రెవెన్యూఆదాయం రూ.2కోట్లు, పన్నేతర ఆదా యం రూ.16.43 కోట్లు సమకూరుతుందని అంచనా వేశారు.

వైస్‌చైర్మన్, కమిషనర్ మధ్య వాగ్వాదం

కాగా బడ్జెట్‌పై జరిగిన చర్చలో వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. జహీర్ రంజానీ మాట్లాడుతూ జనరల్ ఫండ్ అంతా కార్మికుల వేతనాలకే కేటాయిస్తే వార్డుల్లో అభివృద్ధి ఎలా జరుగుతుందన్నారు. త్వరలో ఎన్నికలు ఉన్నాయని సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు వంటి పనులు చేపట్టకుండా తాము ఎన్నికలకు ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. అభివృద్ధి పనులకు కేటాయించకుంటే ప్రజలను పన్నులు కట్టనివ్వమన్నారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ.. కార్మికులు వేతనాల కోసం ప్రతి నెలా ఆందోళనలు చేస్తున్నారని దీంతో జనరల్ ఫండ్‌లో వారికే ప్రాధాన్యతనిస్తామని సమాధానమిచ్చారు. దీంతో ఆగ్రహించిన వైస్ చైర్మన్ కమిషనర్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కమిషనర్ సైతం అదే తరహాలో స్పందించారు. బీజేపీ కౌన్సిలర్ కృష్ణ స్పందిస్తూ కమిషనర్ చైర్‌వద్దకు వెళ్లి వాగ్వాదానికి దిగారు. నిధులు ఎందుకు కేటాయించరని ఆగ్రహంతో ప్రశ్నించారు. దీంతో కొద్దిసేపు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. చివరకు చైర్మన్ జోక్యం చేసుకుని సర్ది చెప్పడంతో సద్దుమనిగింది. సమావేశంలో డీఈ తిరుపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్ లేకపోవడంపై వైస్‌చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గారడి అంకెలు కాకుండా వాస్తవానికి దగ్గరగా ఉండే బడ్జెట్ రూపొందించాలని కౌన్సిలర్ శ్రీనివాస్ కోరారు. అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆదాయాన్ని పెంచుకునేలా రీఅసెస్‌మెంట్ చేయాలని కౌన్సిలర్లు విజయ్, కృష్ణ, నజీర్ కోరారు.



ప్రతీ ఇంటి ఎదుట ఎడ్లబండిపై డ్రమ్ము కనిపిస్తుందిలా..

గొంతు తడవాలంటే.. బండి కట్టాల్సిందే!

ఏంటి ఇంటి ముందర ఎడ్లబండి.. దానిపై డ్రమ్ము ఉందనుకుంటున్నారా.. అవునండి ఆ ఊరిలో ప్రతీ ఇంటి ముందు ఇవే దర్శనమిస్తుంటాయి. ఇంటింటికీ రక్షిత నీటిని అందిస్తున్నామని పాలకులు పదే పదే చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కనిపించని పరిస్థితి. నీళ్ల కోసం ఆ గ్రామస్తుల ఇక్కట్లు వర్ణనాతీతం. గొంతు తడవాలంటే ఎడ్ల బండి కట్టాల్సిందే అంటున్నారు సిరికొండ మండలం చిమ్మన్‌గూడి వాసులు. గ్రామంలో వాటర్ ట్యాంక్ ఉన్నా ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేయలేదు. దీంతో నిత్యం కిలోమీటర్ దూరంలో ఉన్న చేతి పంపు వద్దకు ఎడ్లబండితో వెళ్లి నీళ్లను తెచ్చుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. ఒక డ్రమ్ము నిండాలంటే అరగంట పాటు శ్రమించాల్సి వస్తుందని అంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ నీటిగోస తీర్చాలని వారు కోరుతున్నారు.

– సిరికొండ

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ సర్కారు నిర్దిష్టమైన ప్రణాళికతో విద్యారంగాన్ని బలోపేతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో గల కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాసిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ సర్కారు విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేయాలన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి గేడం కేశవ్, ఏఎస్‌యూ జిల్లా కార్యదర్శి సలాం వరుణ్, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి దత్తాత్రి, ఏఐఎస్ఎఫ్ నాయకులు వైష్ణవ్, తేజ, రమేశ్, రమాకాంత్, అజయ్, చరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఆదిలాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

- ప్రధాని పర్యటన నేపథ్యంలో..
- నేడు, రేపు డ్రోన్లకు అనుమతి లేదు
- ఇంటర్ విద్యార్థులు రేపు త్వరగా కేంద్రాలకు చేరుకోవాలి
- ఎస్పీ గౌస్ ఆలం



ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: ప్రధాని మోదీ ఈ నెల 4న జిల్లా పర్యటన నేపథ్యంలో ఆదిలాబాద్ పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు ఎస్పీ గౌస్ ఆలం ప్రకటనలో పేర్కొన్నారు. పీఎం భద్రత చర్యల్లో భాగంగా సాధారణ ప్రజలకు స్థానిక ఏరోడ్రాం, పరిసర ప్రాంతాలు నిషేధించినట్లు తెలిపారు. కచ్‌కంటి గ్రామ ప్రజలు ఆదిలాబాద్ పట్టణానికి వచ్చేందుకు పాత సాత్నాల రహదారిని వినియోగించుకోవాలని సూచించారు. అలాగే కేఆర్‌కే కాలనీవాసులు మావల పోలీస్‌స్టేషన్, తిరుమల పెట్రోల్‌బంక్ మీదుగా పట్టణానికి చేరుకోవాలని తెలిపారు. అంకోలి, తంతోలి గ్రామ ప్రజలు కృష్ణానగర్ నుంచి మావల పోలీసుస్టేషన్ ముందు గల రోడ్డు మార్గం గుండా రాకపోకలు సాగించాలని పేర్కొన్నారు. ప్రధాని సభకు వచ్చే ప్రజలకు సంబంధించిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను వినాయక చౌక్ వద్ద గల మధుర జిన్నింగ్, గౌతమ్ మోడల్ స్కూల్ వద్ద పార్కింగ్ చేయాలని సూచించారు. సభకు వచ్చే బస్సులను స్థానిక డైట్ కళాశాల మైదానం, రామ్‌లీలా మైదానం, టీటీడీసీ ఎదురుగా ఉన్న ప్రదేశాల్లో పార్కింగ్ చేయాలని పేర్కొన్నారు. అలాగే పట్టణంలో ఆది, సోమవారాల్లో సభాస్థలి, హెలిప్యాడ్, తదితర ప్రాంతాల్లో డ్రోన్లను పూర్తిగా నిషేధించినట్లు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం ఇంటర్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు వీలైనంత త్వరగా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ఉపాధి.. వేగవంతం

- పల్లెల్లో ఊపందుకున్న పనులు
- జోరుగా సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు
- పూర్తి చేసేందుకు ఈనెల 31గడువు

కైలాస్‌నగర్: పల్లెల్లో ఉపాధి హామీ పనుల జాతర కొనసాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపర్చాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఏటా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రత్యేక నిధులు కేటాయిస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను మెటీరియల్ కాంపోనెంట్ కింద జిల్లాకు రూ.38.57కోట్లను గత నెలలో విడుదల చేసింది. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ నెల 31లోపు నిధులు ఖర్చు చేయాల్సి ఉండటంతో పనులను వేగవంతం చేశారు.

691 పనుల మంజూరు

జిల్లాకు కేటాయించిన నిధులతో చేపట్టాల్సిన పనులకు సంబంధించి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి మంత్రి సీతక్క ద్వారా ప్రతిపాదనలు స్వీకరించారు. వాటి ఆధారంగా 691 పనులు చేపట్టేలా కలెక్టర్ రాహుల్ రాజ్ మంజూరు చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 48 సీసీ డ్రెయినేజీలు, 643 సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు.



భీంపూర్ మండలం అర్లి-టి గ్రామంలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

ఊపందుకున్న పనులు

సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాల పూర్తికి ఈనెల 31వరకు గడువు ఉండటంతో పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ఎమ్మెల్యేల అనుచరులతో పాటు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, అధికార పార్టీ గ్రామస్థాయి ముఖ్య నాయకులు ఈ పనులను చేపడుతున్నారు. 691 పనులకు గాను ఇప్పటి వరకు 450 వరకు ప్రారంభమవగా అందులో 155 పూర్తయ్యాయంటే ఎంతవేగంగా సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. అయితే ఈపనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలున్నాయి. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ పనులను పర్యవేక్షించాల్సిన క్వాలిటీకంట్రోల్ విభాగం అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతోపనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

గడువులోపు పూర్తి చేస్తాం

జిల్లాకు మంజూరైన సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాల పనులన్నీ దాదాపుగా ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 155 పూర్తయ్యాయి. మిగతా పనులు సైతం గడువులోపు పూర్తిచేసేలాదృష్టి సారించాం. నాణ్యత ప్రమాణాల ప్రకారం పనులు జరిగేలా మండలస్థాయి ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాలి. నాణ్యతను విస్మరిస్తే మాత్రం ఎంబీలను రికార్డు చేసే అవకాశముండదు.

– మహావీర్, పీఆర్, ఈఈ

అర్హులందరికీ జీరో విద్యుత్ బిల్లులు

బేల: అర్హులందరికీ జీరో బిల్లులు అందిస్తామని విద్యుత్ శాఖ వరంగల్ జనరల్ మేనేజర్, జిల్లా నోడల్ అధికారి ఎస్. దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఇంటింటా తిరుగుతూ విద్యుత్ మీటర్ రీడింగ్‌తో జీరో బిల్లులపై పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ బిల్లులు ఉంటాయని తెలిపారు. కార్డు ఉండి జీరో బిల్లు రానట్లయితే వెంటనే ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఆ శాఖ అధికారులు దిగంబర్ సాహనే, ఎడ్డన్న, సంతోష్ తదితరులున్నారు.



జీరో విద్యుత్ బిల్లు అందిస్తున్న దేవేందర్

నేడు పల్స్ పోలియో

- జిల్లాలో 730 కేంద్రాలు
- డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లావ్యాప్తంగా ఆదివారం చేపట్టనున్న పల్స్ పోలియోను విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో పల్స్ పోలియో కరపత్రాలను శనివారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్నారులు వైకల్యం బారిన పడకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. అప్పుడే పుట్టిన పసికందు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పకుండా వేయించాలన్నారు. చుక్కల మందు వేయించుకోని వారికి సోమ, మంగళవారాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

78 వేల మందికి..

జిల్లాలో ఐదేళ్లలోపుచిన్నారులు 78వేలమంది ఉన్నారని, వారందరికీ చుక్కల మందు వేయాలని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. ఇందుకోసం 730 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతంలో 83, గ్రామీణ ప్రాంతాల్లో 155, గిరిజన ప్రాంతాల్లో 492 ఏర్పాటు చేసినట్లు వివరించారు. మొత్తం 2,920 మంది సిబ్బంది నియమించగా, ఒక్కో కేంద్రానికి నలుగురు చొప్పున కేటాయించినట్లు తెలిపారు. పర్యవేక్షణ కోసం 73మంది సూపర్‌వైజర్లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో లక్ష డోస్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వైసీ శ్రీనివాస్, మాస్ మీడియా అధికారి వెంకట్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారి అశోక్,ఫార్మాసిస్టు శ్రీకాంత్ పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్, మంచి ర్యాల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ డిగ్రీ పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు ఆదిలాబాద్ లోని బీసీ స్టడీ సర్కిల్‌లో చేసుకోవాలన్నారు. శిక్షణ తరగతులను ఈ నెల 11 నుంచి ప్రారంభించనున్నట్లు వివరించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అలాగే డైలీ, వారంతపు టెస్టులు నిర్వహించనున్నట్లు వివరించారు. అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్, డిగ్రీ లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక చేయ డం జరుగుతుందన్నారు. వివరాలకు ఫోన్ 08732-221280 నంబర్‌పై సంప్రదించాలన్నారు.

పబ్లిక్ స్కూల్ ప్రవేశానికి..

ఉట్నూర్‌రూరల్: 2024-25 విద్యా సంవత్సరానికి హైదరాబాద్‌లోని బేగంపేట, రామంతపూర్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా శనివారం తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలోని అర్హులైన గిరిజన బాలికలకు 3, బాలురకు 3 సీట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 01-06-2017 నుంచి 31-05-2018 తేదీల మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఈ నెల 4 నుంచి 11 తేదీలోగా దరఖాస్తులను గిరిజన సంక్షేమ ఉపసంచాలకుల కార్యాలయంలో అందజేయాలని కోరారు. 14 తేదీన డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక ఉంటుందని వివరించారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు బోనఫైడ్, జనన, ఆదాయ, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలను జతచేయాలని సూచించారు.

ఒకరి మృతి


నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన గాల్వే శంకర్ (46) శనివారం సాయంత్రం మృతిచెందాడు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న శంకర్ నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉదయం డయాలసిస్ చేయించుకునేందుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నేరడిగొండ మండల కేంద్రంలో ఆగాడు. ఓ హోటల్‌లో ఆయన బంధువులను కలిసి వారితో కాసేపు మాట్లాడాడు. వారు వారసంతకెళ్లి కూరగాయలు తీసుకొచ్చేలోగా ఆయన అపస్మారక స్థితిలో కనిపించాడు. దీంతో గమనించిన బంధువులు ప్రైవేట్ వాహనంలో బోథ్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

పిచ్చికుక్క దాడిలో చిన్నారికి గాయాలు

పెంబి: మండలంలోని తాటిగూడ గ్రామానికి చెందిన భుక్యా అమర్‌సింగ్ నాలుగేళ్ల శాన్విక ఉదయం 8గంటల సమయంలో ఇంటి ఎదుట ఆడుకునే సమయంలో పిచ్చి కుక్క దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. గమనించిన స్థానికులు కుక్కను తరిమి చిన్నారిని రక్షించారు. తీవ్రంగా రక్తస్రావం కావడంతో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పిచ్చికుక్కల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

సమన్వయ లోపం.. అభ్యర్థులకు శాపం

- ఇంటర్ వృత్తివిద్యా క్రాప్‌ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ అభ్యర్థులకు తీరని నష్టం
- ఏఈవో ఉద్యోగాలకు అర్హులుగా అవకాశం ఇవ్వాలని వేడుకోలు
- ఉమ్మడి జిల్లాలో మూడు వేల మంది ఎదురు చూపు
- జీవో 428 అమలు చేయాలని కలెక్టరేట్, మంత్రులకు వినతులు



నిర్మల్‌ఖిల్లా: వారంతా ఇంటర్ ఒకేషనల్ కోర్సు అయిన క్రాప్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ చదివిన అభ్యర్థులు. అందరిలాగే ఉద్యోగాలు వస్తాయని వ్యయ ప్రయాసల కోర్చి కోర్సు పూర్తిచేశారు. వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈవో) ఉద్యోగాలకు అర్హులని చేప్పే ప్రభుత్వ ఉత్తర్వులు కూడా ఉన్నాయి. 1985 లోనే జీవో 428 ద్వారా ఏఈవో ఉద్యోగులకు అర్హులంటూ చెప్పే ఉత్తర్వులు అమలుకు నోచుకోకపోవడంతో కొన్నేళ్లుగా ఈ కోర్సు చదివిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని దాదాపు 3 వేల మంది తీవ్రంగా నష్టపోతున్నారు. గ్రామీణ పేద విద్యార్థులకు ఆధునాతన సాంకేతిక వ్యవసాయ విధానాలను తెలియజేసే పాఠ్యాంశాలతోపాటు, సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో కోర్సును ప్రవేశపెట్టారు. కానీ ఈ కోర్సు చదివిన వారు ఉపాధికి మాత్రం అర్హులు కారంటూ దూరం చేస్తున్నారని అభ్యర్థులు పేర్కొంటున్నారు.

2011లో ఉత్తర్వులు..

క్రాప్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ ఒకేషనల్ కోర్సును పూర్తిచేసిన అభ్యర్థులకు వ్యవసాయ శాఖలోని ఏఈఓ గ్రేడ్-2 ఉద్యోగాలకు అర్హులుగా పరిగణించాలని కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ 2011, జూలై 16న ఉత్తర్వులు జారీ చేసింది. కానీ వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం దానిని అమలు చేయడంలో తాత్సారం చేస్తున్నారని అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్) వంటి సంస్థలు క్రాప్ ప్రొడక్షన్ కోర్సును అర్హతగా పరిగణిస్తున్నా రాష్ట్ర వ్యవసాయ శాఖలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని అంటున్నారు. ఇప్పటికైనా జీవో 428 అమలు చేస్తూ ఏఈవో పోస్టులకు అర్హులుగా పరిగణించాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డిప్లొమాతో సరిసమానం..

అగ్రికల్చర్ క్రాప్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అనే ఒకేషనల్ కోర్స్‌ని తెలంగాణ రాష్ట్ర ఒకేషనల్ ఇంటర్మీడియట్ బోర్డు వారు అందింస్తుండగా డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ కోర్స్‌ని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు అందిస్తున్నారు. ఈ రెండు కోర్సులు కూడా పదో తరగతి అనంతరం అందిస్తున్న రెండేళ్ల కాల పరిమితితో కూడిన కోర్సులే. చట్టబద్ధంగా తమను కూడా అర్హులుగా పరిగణించాలని వొకేషనల్ అభ్యర్థులు కోరుతున్నారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేసినట్లు చెబుతున్నారు. 2022లో విడుదల చేసిన జీవో 103 ఉన్నత విద్యా శాఖ ఉత్తర్వుల మేరకు ఐటీఐ, ఒకేషనల్ కోర్సుల వంటి డిప్లొమా కోర్సులు ఇంటర్మీడియెట్‌కి సమాన అర్హతగా పరిగణించాలని సూచించింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఒకేషనల్ ఇంటర్మీడియట్ వారు కూడా డిప్లొమాకి సమానం కాబట్టి ఏఈఓ గ్రేడ్-2 ఉద్యోగాలకు అగ్రికల్చర్ క్రాప్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ వారు కూడా అర్హులవుతారని అభ్యర్థులు వాదిస్తున్నారు.

త్వరలో ఏఈవో పోస్టుల భర్తీ..

నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న రోజుల్లో వ్యవసాయ శాఖలోని ఏఈఓ గ్రేడ్ 2 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో చర్చకు రావడంతో ఈ పోస్టుల అర్హతలపై సందిగ్ధం నెలకొంది. ఇంటర్మీడియెట్‌లోని ఒకేషనల్ కోర్సు అయిన క్రాప్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్‌ను అర్హతల్లో పరిగణించాలని ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ప్రజావాణిలో కలెక్టర్‌కు సైతం తమ సమస్యను విన్నవించారు.

పరిస్థితి అగమ్యగోచరం...

క్రాప్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసిన అభ్యర్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జీవో 428 అమలు చేయకపోవడంతో అభ్యర్థులకు నష్టం జరుగుతుండడంతో ఆవేదన చెందుతున్నారు. ఏఈవో గ్రేడ్- 2 ఉద్యోగా లకు దరఖాస్తు చేసుకునే వీలుకల్పించకపోవడంతో నిరుద్యోగులుగా మారుతున్నారు. పలుమార్లు కలెక్టరేట్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ వినతిపత్రాలు ఇస్తున్నా ఫలితం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లుగా అభ్యర్థిస్తున్నాం...



క్రాప్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ ఒకేషనల్ అగ్రికల్చర్ కోర్స్‌ని పూర్తి చేశాను. వ్యవసాయ శాఖ నియామకాల్లో ఏఈవో గ్రేడ్-2 ఉద్యోగాలకు అర్హులైనా ఇప్పటివరకు మాకు అవకాశం కల్పించడం లేదు. ఇదే అంశంపై పలుమార్లు కోర్టుమెట్లు ఎక్కాం. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రులను కూడా కలిసి విన్నవిస్తున్నాం. మా అభ్యర్థులు ఆయా జిల్లాల కలెక్టరేట్లలో కూడా వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. జీవో 428 ప్రకారం ఏఈవో నియామకాల్లో అవకాశం కల్పించాలి.

– పి.వంశీకృష్ణ, అభ్యర్థి, నిర్మల్

అర్హులుకారు అంటున్నారు...



ఉపాధి అవకాశాలు లభించి జీవితంలో స్థిరపడతామన్న ఆశతో ఈ కోర్సును పూర్తి చేశాం. ఇప్పుడు అర్హులు కారని అధికారులు చెబుతున్నారు. పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అర్హులుగా పరిగణిస్తూ ఏఈవో గ్రేడ్ 2 పోస్టులకు అవకాశం ఇవ్వాలి.

– దుంపటి గిరిజ, పాత ఎల్లాపూర్, ఖానాపూర్ మండలం

ఉత్తర్వులు అమలు చేయాలి..



గతంలోని 428 జీవో ఉత్తర్వులు, రాష్ట్ర హైకోర్టు సూచనలు అనుసరించి వ్యవసాయ శాఖలోని ఉద్యోగాలకు మాకు అవకాశం కల్పించాలి. క్రాప్ ప్రొడక్షన్ కోర్సు చేసిన వారికి ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– భూక్యా నగేశ్, మున్యాల్, దస్తురాబాద్ మండలం

గురుకుల కొలువు సాధించారు..

తండ్రి కార్పెంటర్.. కొడుకుకు గురుకుల కొలువు

నిర్మల్‌ఖిల్లా: ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తే లక్ష్యసాధన పెద్ద కష్టమేమీ కాదని నిరూపించిన యువకులెందరో ఉన్నారు. ఇదే కోవలో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన గన్నారం ఉదయ్ కుమార్ ఒకరు. ఇటీవల విడుదల చేసిన గురుకుల ఫలితాల్లో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) కొలువును చేజిక్కించుకున్నాడు. ప్రభుత్వ కొలువు అంటేనే నానాటికి గగనం అయిపోతున్న ఈ రోజుల్లో లక్ష్యంకోసం నిరంతరం శ్రమించి ఉద్యోగాన్ని సాధించాడు.



ఉదయ్‌కుమార్

పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన దిగువ మధ్యతరగతి కుటుంబానికి గంగామణి–బ్రహ్మయ్య దంపతుల పెద్ద కొడుకు ఉదయ్‌కుమార్. తండ్రి బ్రహ్మయ్య కార్పెంటర్‌గా పనిచేస్తూ ఇద్దరు కుమారులను చదివించాడు. చిన్నకొడుకు లక్ష్మణ్ సైనికుడిగా దేశానికి సేవలందిస్తున్నాడు. ఉదయ్‌కుమార్ ఆరో తరగతి నుంచి కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో చదివాడు. ఇంటర్మీడియట్, డిగ్రీని జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పూర్తిచేశాడు. ఉస్మానియాలో బిఎడ్ శిక్షణను పొంది అప్పటి నుంచి ప్రభుత్వ కొలువు కోసం శ్రమిస్తూ వస్తున్నాడు.

ఎన్నికల బరిలో నిలిచి...



రాజేందర్

నిర్మల్‌ఖిల్లా: గత శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా నిర్మల్ నియోజకవర్గం నుంచి స్వతంత్రంగా బరిలా నిలిచిన యువకుడు ఓటమి పాలయ్యాడు. గురుకుల ఫలితాల్లో జూనియర్ లెక్చరర్‌గా కొలువు సాధించాడు. జిల్లాలోని లక్ష్మణచాంద మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన బుర్క లక్ష్మి- చిన్నయ్య దంపతుల కుమారుడు రాజేందర్. డిగ్రీ వరకు నిర్మల్ జిల్లా కేంద్రంలో, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశాడు. ప్రస్తుతం ఉస్మానియాలో వృక్షశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నాడు.

తొలి ప్రయత్నంలోనే..



ఆకాష్

బోథ్: మండలంలోని చింతలబోరి గ్రామానికి చెందిన కాంబ్లే రాధా బాయి, భీంరావ్‌ల కుమారుడు ఆకాష్ గురుకుల టీజీటీలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తొలి ప్రయత్నంలోనే ఉద్యోగానికి ఎంపిక కావడంతో ఆకాష్‌ను గ్రామస్తులు అభినందించారు.

పేదరికం అడ్డురాదని నిరూపించారు..



శ్రీకాంత్



అవినాష్



ప్రియాంక

తాంసి: పేదింట పుట్టి ప్రభుత్వ పాఠశాలలో చదివి గురుకుల ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించారు తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన యువకులు. తాంసి మండల కేంద్రానికి సంతపురి శ్రీకాంత్ శుక్రవారం రాత్రి విడుదలైన గురుకుల ఉపాధ్యాయ ఫలితాల్లో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. టీటీసీ పూర్తి చేసి హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ తెలుగు పూర్తిచేసి ప్రస్తుతం ఓయూలో ఎంఏ ఇంగ్లిష్ చదువుతూ ప్రభుత్వ ఉద్యోగానికి సన్నద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో గురుకుల పరీక్ష రాసి ఉద్యోగం సాధించాడు. చిన్నతనంలో నాన్న చనిపోయినప్పటికీ కుమారుడిని తల్లి భూమక్క కష్టపడి చదివించింది. భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన నడికుంట్ల అవినాష్ రెండు గురుకుల లెక్చరర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఉద్యోగం సాధించాడు. వడూర్ గ్రామానికి మందగుడ్ల ప్రియాంక ఇదివరకే కానిస్టేబుల్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై శిక్షణలో ఉంది. గురుకుల ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికైంది.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు సిమెన్స్ స్కాలర్‌షిప్ ప్రొగ్రాంకు ఎంపికయ్యారు. బాసరకు చెందిన 22 మంది విద్యార్థులు ఈ సంస్థ ఇచ్చే స్కాలర్‌షిప్ అందుకోనున్నారు. 2013లో సిమెన్స్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం ప్రారంభించింది. 27 రాష్ట్రాల్లోని 125 కళాశాలల్లో చదువుతున్న 1,335 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ కింద ఎంపికచేసింది. బాసర ట్రిపుల్‌ఐటీ నుంచి 2019లో ఒక విద్యార్థి, 2020లో ఆరుగురు, 2021లో 11 మంది, 2022లో ఎనిమిది మంది ఎంపికయ్యారు. 2023లో 200 మంది దరఖాస్తు చేసుకున్నా ఎవరూ ఎంపికకాలేదు. 2024లో 22 మంది ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు ట్యూషన్‌ఫీజు, రియంబర్స్‌మెంట్, పుస్తకాలు, స్టేషనరీ, హాస్టల్, అదనపు తరగతులు మొదలైన వాటికి సిమెన్స్ సంస్థ అలవెన్సులు ఇస్తుందని ట్రిపుల్‌ఐటీ అధికారులు వివరించారు. ఎంపికైన విద్యార్థులను ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ, సమన్వయకర్త రాకేశ్‌రెడ్డి అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ట్రిపుల్‌ఐటీ వీసీ

భీమ్‌గంగా ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలి

ఎదులాపురం: భీమ్‌గంగా అనే ప్రత్యేక రాష్ట్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని భీమ్ గంగా రాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షుడు నర్సయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న ఉత్తర తెలంగాణంలోని ఎంపీ స్థానాలు ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, పెద్దపల్లితో పాటు గోదావరి పరివాహక ప్రాంత ఎంపీ స్థానాలు గడ్చిరోలి, చంద్రపూర్, చత్తీస్‌ఘడ్‌లోని మరికొన్ని లోకసభ స్థానాలను కలుపుకుని ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాలు ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వెనుకబడిన ప్రాంతాల కోసం ఎంతో మంది పోరాట యోధులు తమ ప్రాణాలను పణంగా పెట్టారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని భీమ్ గంగా పేరుతో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును కోరుతున్నట్లు వివరించారు. ఇక్కడి ప్రాంతాల అభివృద్ధికి ఆకాంక్షిస్తూ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇందులో భీమ్ గంగా రాష్ట్ర సమితి నాయకులు సంతోష్‌కుమార్, సుదర్శన్, రాజేశ్వర్, విజయ్, రాంకిషన్, షహజాద్ హుస్సేన్, గంగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు నర్సయ్య

ఆశ్రమ పాఠశాల విద్యార్థినికి గాయాలు



శ్రీజను ఆటోలో ఇంటికి తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న జాదవ్ శ్రీజ అనే విద్యార్థికి గాయాలయ్యాయి. మండలంలోని సక్రియనాయక్‌తండాకు చెందిన ఆమె తల్లిదండ్రులు జాదవ్ బలరాం, సుజాత వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి పాఠశాలలో నిద్రిస్తున్న సమయంలో మంచం పైనుంచి కింద పడడంతో తలకు గాయాలైనట్లు పేర్కొన్నారు. పాఠశాల సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా తలకు ఐదు కుట్లు పడినట్లు తెలిపారు. పాఠశాల యాజమాన్యం ఈ విషయాన్ని తమకు తెలియజేయకుండా గోప్యంగా ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన జరిగిన సమయంలో వార్డెన్ అందుబాటులో లేకపోగా, స్థానికంగా ఉన్న ప్రధానోపాధ్యాయులు పట్టించుకోలేదని వాపోయారు. శనివారం సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని శ్రీజను ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించేందుకు తీసుకెళ్లారు.

ఆశ్రమాల్లో అందని పౌష్టికాహారం

- రక్త హీనతతో బాధపడుతున్న బాలికలు
- బాలికల ఆరోగ్యాన్ని పట్టించుకోని ప్రభుత్వం



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికలు

ఆదిలాబాద్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఐటీడీఏ పరిధిలో 133 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 77 బాలుర ఆశ్రమ పాఠశాలలు ఉండగా 20వేల వరకు విద్యార్థులు ఉన్నారు. 56బాలికల ఆశ్రమ పాఠశాలలు ఉండగా 15వేల వరకు విద్యార్థినులు ఉన్నారు. బాలికలకు పౌష్టికాహారం అందకపోవడంతో రక్తహీనతతో బాధపడుతున్నారు. బాలికల శరీరంలో ఉండాల్సినంతా రక్తం ఉండకపోవడంతో అనారోగ్యాల బారిన పడిన సమయంలో వ్యాధులను తట్టుకోలేకపోతున్నారు. దీనికి ఉదాహరణే శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మామిడిగూడ ఆశ్రమ పాఠశాలకు చెందిన పలువురు బాలికలు రక్తహీనతతో బాధపడుతూ రిమ్స్ ఆసుపత్రిలో చేరారు. వైద్యులు రక్త నమూనాలు సేకరించి పరీక్షించగా వారి శరీరంలో ఒక్కొక్కరిలో కేవలం 5 నుంచి 6గ్రాముల రక్తం మాత్రమే ఉన్నట్లు గుర్తించారు.

గతంలో ప్రత్యేక శిబిరాలు..

జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న బాలికల ఆరోగ్య పరీక్షలు చేసేందుకు 2017-18 విద్యా సంవత్సరంలో వసతి గృహాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. వచ్చినా రిపోర్టు ఆధారంగా వారికి చికిత్సలు అందజేశారు. తర్వాత అలాంటి శిబిరాలు నిర్వహించకపోవడంతో బాలికలు అనారోగ్యాల బారిన పడి కొన్ని సందర్భాల్లో మృతి చెందుతున్నారు. నలుగు రోజుల కిందట ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థినికి జ్వరం రావడంతో వ్యాధిని తట్టుకోలేక రక్త హీనతతో బాధపడుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రధానంగా వారికి పౌష్టికాహారం అందకపోవడంతోనే బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారని పలు గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి గతంలో మాదిరిగా వసతి గృహాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి చికిత్సలు అందించాలని కోరుతున్నారు.

రక్తహీనతతో బాధపడుతున్న విషయం వాస్తవమే

ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న చాలా మంది బాలికలు రక్త హీనతతో బాధపడుతున్న విషయం తమ దృష్టికి వచ్చింది. రక్త హీనతతో బాధపడుతున్న బాలికలను గుర్తించేందుకు గతంలో వసతి గృహాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాం. అలాంటి వారిని గుర్తించి చికిత్సలు అందించడం జరిగింది. రక్తహీనతతో బాధపడుతున్న వారు అనారోగ్యం బారిన పడిన సమయంలో వ్యాధిని తట్టుకోలేకపోతున్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ఆలోచిస్తున్నాం.

– దిలీప్‌కుమార్, డీడీ, ఐటీడీఏ, ఉట్నూర్

వినాశనం నుంచి కాపాడే శక్తి ఆధ్యాత్మికతకే ఉంది



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న సభ్యులు

- వైష్ణవ సదన్ పీఠాధిపతి సంత్ శ్రీనారాయణ మహరాజ్

గుడిహత్నూర్: విజ్ఞానం మనిషి వికాసానికి దోహదపడుతుందని, వినాశనం నుంచి కాపాడే శక్తి మాత్రం ఆధ్యాత్మికతకే ఉందని వైష్ణవ సదన్ పీఠాధిపతి సంత్ శ్రీ నారాయణ మహరాజ్ అన్నారు. శనివారం సనాతన ధర్మ సేవా సమితి మండల శాఖను స్థాపించి మాన్కాపూర్‌లోని సంత్ పూలాజీబాబా ధ్యాన కేంద్రంలో నిర్వహించిన సమ్మేళన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సనాతన ధర్మంలోని విశేషతను సనాతన ధర్మ ఆవశ్యకతను ప్రతి హిందువూ తెలుసుకొని పాటించాలన్నారు. సనాతన ధర్మ ప్రతిష్ఠను ప్రపంచానికి చాటాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ముందుకు సాగుతోందని వివరించారు. ఇతర మతాలను కించపరచకుండా హిందూ ధర్మ సంస్కృతి సంప్రదాయాలు కాపాడాల్సి బాధ్యత యువతపై ఉందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడవాలని సూచించారు. అన్ని గ్రామాల్లో పురుషులు ప్రతీ శనివారం, మహిళలు మంగళవారం ఏక సమయంలో సంఘటితంగా సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ చేపట్టాలని కోరారు. అంతకుముందు మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద గల పోచమ్మ ఆలయం నుంచి ప్రధాన వీధుల గుండా సుమారు 1000 మంది యువకులు రూప దుస్తులు ధరించి శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక శివాలయం ఎదుట సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో హరిభక్త పారాయణ్ సంత్ శ్రీ సోపాన్ మహారాజ్, వక్తలు దిగంబర్ జీ, గిరిజన మొదటి మహిళా పైలట్ అజ్మీరా బాబీ, ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవహ బాలాజీ పస్తాపురే పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంత్ శ్రీ నారాయణ్ మహరాజ్